# ఇదీ పాలకుల సహకారం!

జయప్రకాష్ నారాయణ్

BB 13-Feb-2006

మనదేశంలోని అధికారులు, రాజకీయ నాయకులు వ్యవసాయ రంగాన్ని దెబ్బతీయడానికి గత కొన్ని దశాబ్దాలుగా చేయాల్సిందంతా చేశారు. అయిదు, ఆరు దశకాల్లో ఉమ్మడి వ్యవసాయంపై మోజు పెరిగింది. ఈ విషయంలో సోవియట్ నమూనాను అనుసరించేందుకు సైతం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నించింది. అది పద్ధతి కాదంటూ కొంతమంది బుద్ధి చెప్పడంతో గండం గడిచింది. ప్రపంచ వ్యవసాయ భూమిలో 12 శాతం కలిగి ఉన్నప్పటికీ, మనుగడకోసం ఎప్పటికీ ఆహార ధాన్యాల దిగుమతిపైనే ఆధారపడాల్సిన దుస్థితి మన దేశానికి తప్పింది. ఆహార ధాన్యాల వ్యాపారాన్ని సైతం జాతీయం చేస్తూ- 1970లలో ప్రభుత్వం పనికిమాలిన నిర్ణయం తీసుకొంది. ఆ మేరకు ఆదేశాలు కూడా జారీ అయ్యాయి. మన అదృష్టమేమోకానీ, తీవ్ర అవినీతి, ప్రభుత్వ అసమర్థత కారణంగా ఆ పథకం పత్తా లేకుండా పోయింది. ప్రభుత్వం ఒక వివేకవంతమైన చర్య తీసుకొనకపోలేదు. అది- వ్యవసాయ ఉత్పాదకత పెంచాలన్నది. ఈ చర్య హరిత విప్లవానికి దారితీసింది. దేశంలో ఆహార భద్రతకు దోహదపడింది. సి. సుబ్రమణ్యం స్ఫూర్తిదాయక సారథ్యం, బి.ఎన్. శివరామన్ అకుంఠిత దీక్షా దక్షతలు, నార్మన్ బోర్లాంగ్ పథ నిర్దేశకత్వం, దేశవ్యాప్తంగాగల అసంఖ్యాక శాస్త్రజ్ఞుల అవిశ్రాంత కృషి కారణంగా మనదేశ వ్యవసాయ, ఆర్థికరంగాల రూపురేఖలే మారిపోయాయి. నీటిపారుదల రంగంలో తగినన్ని ప్రభుత్వ పెట్టుబడులవల్ల మరింతగా ప్రయోజనం చేకూరింది. ఆ తరవాత పరిస్థితి..?

### *సర్కారు విధానాలతో చేటు*

ప్రభుత్వ విధానాల వల్ల రైతులకు, ఉత్పత్తిదార్లకు చెప్పలేనంత హాని జరిగింది. మార్కెట్ రేటుకన్నా తక్కువకు ఆహార ధాన్యాలను నిర్బంధంగా సేకరించడం, అవినీతి, అసమర్థతల ద్వారా రైతులను దెబ్బతీశారు. వ్యవసాయ ఉత్పత్తులను అమ్ముకొందామంటే- అడ్డమైన షరతులు విధించారు. వినియోగదార్లకు ప్రయోజనాలు కలుగకుండా అడ్డుకొన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకం, రవాణా, నిల్వలపై ఈనాటికీ ఎన్నో నియంత్రణలు కొనసాగిస్తున్నారు. ఫలితంగా అంతులేని నష్టాలు వాటిల్లుతున్నాయి. అవినీతి పెచ్చుపెరుగుతోంది. గ్రామప్రాంతాల ప్రగతిపథంలో అడ్డంకులు ఎదురవుతున్నాయి. యూరియాపై సబ్సిడీలను ఇప్పటికీ కొనసాగించడం అర్థరహితం. దానివల్ల విలువైన వ్యవసాయ వనరులెన్నో హరించుకుపోతున్నాయి. సమతూకం లేకుండా, విచ్చలవిడిగా ఎరువులు వాడటంవల్ల వ్యవసాయానికి చెరుపు జరుగుతోంది. అసమర్థులు, అనర్హులైన తయారీదార్లే ఈ సబ్సిడీవల్ల లబ్ధిపొందుతున్నారు. గ్రామీణ పరపతి సంస్థలు అత్యంత బలహీనంగా ఉన్నాయి. దాంతో అత్యధిక సంఖ్యలో రైతులు అప్పులకోసం వడ్డీ వ్యాపారులపై ఆధారపడాల్సి వస్తోంది. పంజాబ్, హర్యానాల్లోని మండీలను మినహాయిస్తే ఎక్కడా సరైన సంతల్లేవు. రాజకీయాలు, అవినీతితో అనేక రాష్ట్రాల్లోని మార్కెటింగ్ కమిటీలు భ్రష్టుపట్టి పోయాయి. పత్తి సేకరణలో చోటుచేసుకొన్న కుంభకోణాలు ప్రభుత్వపరంగా గలాటా జరుగుతోందనడానికి గట్టి నిదర్శనం. వ్యవసాయ రంగాన్ని మరింత లాభసాటిగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వపరంగా తీవ్ర ప్రయత్నాలేమీ జరగలేదు. ఫలితంగా గ్రామాలు ఇంకా పేదరికంలోనే మగ్గిపోతున్నాయి. మంచి ఆదాయాలు, ఉపాధి, గ్రామీణ పారిశ్రామికీకరణ కలలుగానే మిగిలిపోతున్నాయి. రైతుల సహకార సంఘాలపై రాజకీయ నాయకులు, అధికారులు రాజ్యాంగ విరుద్ధంగా భల్లూకపు

పట్టు బిగించడం అన్నింటికన్నా విషాదం. ఆంధ్రప్రదేశ్‌లోని పాల ఉత్పత్తి దారుల సహకార సంఘాలను చెర పట్టేందుకు ఉద్యుక్తం కావడంద్వారా తమ అవినీతి, అసమర్థత, దుర్బుద్ధి, రాజ్యాంగ ఉల్లంఘన చర్యలను వారు చాటుకొన్నారు. వారి వైఖరి కారణంగానే గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం నానాటికీ పెరిగిపోతోంది.

సహకార సంఘాలను ఏర్పాటుచేసి నడపడం, ఏదైనా వ్యాపారం నిర్వహించుకోవడం- పౌరులకుగల మౌలిక హక్కు. ఈ మేరకు రాజ్యాంగం స్పష్టమైన హామీ ఇస్తోంది. దేశ సార్వభౌమత్వం, సమగ్రతలకు ముప్పు వాటి ల్లినప్పుడు; శాంతి - సమగ్రతలను కాపాడవలసి వచ్చినప్పుడు; లేదా వృత్తిగత, సాంకేతిక అర్హతలను నిర్దే శించినప్పుడు మాత్రమే ఇలాంటి హక్కులను నియంత్రించడం సహేతుకం అనిపించుకొంటుంది. కానీ, రాజ్యాంగం ప్రసాదించిన స్వేచ్ఛను ప్రభుత్వం కొన్ని దశాబ్దాలుగా బేఖాతరు చేసింది. నిస్సిగ్గుగా, నిరంకు శంగా సహకార సంఘాలను నియంత్రించింది. ప్రభుత్వ అధికారుల అవినీతి, అసమర్థత కారణంగా అనేక సహకార సంఘాలు కుప్పకూలాయి. దాంతో పునరాలోచన మొదలైంది. సహకార సంఘాలను ప్రభుత్వ నియంత్రణకు తావులేకుండా స్వతంత్రంగా ప్రజాస్వామ్యబద్ధంగా, వృత్తిగతంగా నిర్వహించాలని బ్రహ్మప్రకాశ్ కమిటీ (1990), నమూనా సహకార చట్టం (1991), వైద్యనాథన్ కమిటీ (2005) సహా పలు నిపుణుల నివేది కలు నొక్కి చెప్పాయి. యు.పి.ఎ. ప్రభుత్వపు ఉమ్మడి కనీస కార్యక్రమం (సి.ఎం.పి.)లో కూడా ఇలాంటి కట్టుబాటు ఉంది.

పరస్పర సహాయ సహకార సంఘాల (మాక్స్) చట్టాన్ని మొట్టమొదట ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమే 1995లో తీసుకు వచ్చింది. ఈ సంఘాల్లో ప్రభుత్వ వాటాధనం ఉండదు. ప్రభుత్వ సహాయాన్ని ఇవి కోరవు. ఈ మేరకు సహ కార సంఘాలకు రాజ్యాంగం ప్రసాదించిన స్వేచ్ఛను సర్కారు గుర్తించింది. పదకొండు జిల్లా పాల సహకార సంఘాలు ఉండగా, వాటిలో ఎనిమిది సంఘాలు, వాటితోపాటు దాదాపు 5000 ప్రాథమిక పాల సంఘాలు మాక్స్ చట్టం కింద నమోదయ్యాయి. గత కొన్నేళ్లలో అవి అద్భుత ఫలితాలు సాధించాయి. మాక్స్ చట్టం పరిధిలోకి చేరిన పాల సహకార సంఘాల టర్నోవరు అయిదేళ్లలో రెండింతలైంది. వాటి లాభాలు, నికర విలువ బాగా పెరిగాయి. పాడిరైతులకు మంచి ధరలు లభించాయి. సహకార సంఘాలు సభ్యుల లాభాల్ని పంచుకొన్నారు. పశువుల్లో కృత్రిమ గర్భధారణ, వాటికి మంచిమేత అందజేయడం, పశు వైద్య సదుపాయం, పాడిరైతుల కుటుంబాలకు వైద్య సౌకర్యాలు తదితర ఉచిత సేవలను కూడా సహకార సంఘాలు అందజే శాయి. ఇందుకు భిన్నంగా, ప్రభుత్వ నియంత్రణలోనే కొనసాగిన పాలసహకార సంఘాలు పతనమయ్యాయి. అవి భారీ నష్టాలపాలై దివాళా దశకు చేరుకొన్నాయి. ఆ సహకార సంఘాలకు చెందిన పాడి రైతులు పాలను ప్రైవేటు కంపెనీలకు అతి తక్కువధరకు అమ్ముకోవలసి వస్తోంది. భారీ జీత భత్యాలే తప్ప పెద్దగా పనీపాటా లేని అసమర్థ సిబ్బంది, అంతులేని అవినీతి కారణంగా ప్రభుత్వ అధీనంలోని డెయిరీ సమాఖ్య తలకు మించిన భారంగా తయారైంది. ఈ సమాఖ్య పాడిరైతులకు ప్రైవేటు కంపెనీలకన్నా తక్కువ ధర చెల్లి స్తోంది. సమాఖ్యకానీ, ప్రైవేటు కంపెనీలు కానీ రైతులకు ఇతర సేవలేమీ అందించడం లేదు.

ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ నెలలో ఒక అసాధారణ నిర్ణయం తీసుకొంది. మాక్స్ చట్టంకింద విజయవంతంగా, బ్రహ్మాండంగా పనిచేస్తున్న పాల సహకార సంఘాలను ఒక ఆర్డినెన్సు ద్వారా 1964 నాటి చట్టం పరిధిలోకి తెచ్చింది. ఎన్నికైన 'పాల'క వర్గాలను రాత్రికి రాత్రే రద్దుచేసింది. ప్రాథమిక, జిల్లా స్థాయి ల్లోని 5000కు పైబడి సహకార సంఘాల పగ్గాలను అధికారుల చేతికి అప్పగించింది. ఇందుకు ప్రభుత్వం

చెప్పిన కారణాలు హాస్యాస్పదంగా ఉన్నాయి. ప్రభుత్వ కనుసన్నల్లోని జిల్లా సహకార సంఘాలు ఇప్పటికే నేల కూలాయి. వాటిని పైకి లేవనెత్తాల్సిందిపోయి- సహకార పాల సంఘాల ఆర్థిక పరిస్థితిని మెరుగు పరచడా నికి, రైతులకు మేలు చేయడానికి ఈ చర్య తీసుకొన్నామంటోంది. నాబార్డ్ రీఫైనాన్స్ కోసం కొన్ని పరపతి సహకార సంఘాలకు ప్రభుత్వ గ్యారెంటీలు ఇచ్చామని అందువల్ల పాల సహకార సంఘాలు తమ నియంత్ర ణలోనే ఉండాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం వాదిస్తోంది. (పరపతి సహకార సంఘాలతో వీటికి ఎలాంటి సంబంధమూలేదు). ఇలాంటి 'మిత్రులు' ఉండగా రైతులకు వేరే శత్రువులెందుకు? రాజ్యాంగపరమైన హామీలు ఉన్నాయి. ప్రభుత్వ ప్రకటిత విధానాలు ఉన్నాయి. ప్రభుత్వ నియంత్రణలోని సంఘాలు ఆర్థికంగా కుదేలయ్యాయనడానికి తిరుగులేని సాక్ష్యాధారాలు ఉన్నాయి. అయినప్పటికీ- నియంత్రణలను, అవినీతిని కొన సాగించడానికి సర్కారు నేటికీ వెంపర్లాడటం, రాజకీయ క్రీడలకు తెగబడటం విస్మయం కలిగిస్తోంది. ప్రభుత్వ చర్యవల్ల పాడిరైతులు భారీగా నష్టపోతారు. పాలధర విషయంలోను, పాడి సంబంధ వృత్తి వ్యవహారాల్లోను వారు దారుణంగా దెబ్బతింటారు. ఇది జీవన్మరణ సమస్యగా పరిణమిస్తుంది.

*మనుగడకు సుదీర్ఘ పోరాటం*

మనం స్వతంత్ర న్యాయవ్యవస్థను, లిఖిత రాజ్యాంగాన్ని కలిగి ఉన్నాం. వీటి పుణ్యమా అని న్యాయపోరా టాల్లో రైతులు విజయం సాధించగలరు. అయినప్పటికీ - బతుకులు బాగుపడే మాట అటుంచి, ఉన్న పరిస్థి తుల్లోనే కొనసాగడానికే వారు సుదీర్ఘ పోరాటం సాగించాల్సి ఉంటుంది. ఒక అడుగు ముందుకు - రెండడు గులు వెనక్కి అంటే ఇదే!

వ్యవసాయం, సహకార రంగం, విద్య, ఆరోగ్యం, స్థానిక ప్రభుత్వాల విషయంలో ప్రభుత్వాలు చేపట్టే చర్యల పైనే గ్రామీణ భారత ఆర్థిక భవితవ్యం, పట్టణ పేదల పరిస్థితి ఆధారపడి ఉన్నాయి. రాష్ట్రాల్లో పరిపాలన వ్యవస్థ తీరుతెన్నులు, గ్రామీణ ఆదాయాలు, రాజ్యాంగబద్ధ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, ప్రజాపరిపాలన అన్నవి అవినాభావ సంబంధం కలిగి ఉన్న అంశాలు. అయినప్పటికీ - కేంద్ర ప్రభుత్వంలో ఎంతో పలుకుబడి కలిగి ఉన్న ప్రధాన పార్టీల ఏలుబడిలోని రాష్ట్రాల్లో కక్షసాధింపు చర్యలు, రాజ్యాంగ ఉల్లంఘనలు, తాత్కాలిక నిర్ణ యాలు, కర్ర ఉన్నవాడిదే బర్రె అనే ధోరణి కొనసాగుతున్నాయి. ఎడమ చెయ్యి ఏం చేస్తోందో కుడి చెయ్యికి తెలియదు. రాజకీయ మార్పులు, పరిపాలన సంస్కరణల పైనే మన ఆర్థిక భవిష్యత్తు ఆధారపడి ఉందనేది సుస్పష్టం.

(రచయిత లోక్‌సత్తా, 'ఓట్ ఇండియా'ల సమన్వయకర్త)